# డబ్బెవరికి చేదు?

మినీ కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

హైదరాబాద్‌లోని ఓ బేంక్‌ని పట్టపగలే దోచుకున్నాడో దొంగ. నాటుబాంబులు, తుపాకీతో కేషియర్లని బెదిరించి ఇరవై ఆరు లక్షల రూపాయలతో పరారీ అయ్యాడు.

క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సి ఐ డి) కి చెందిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పిళ్ళై ఆ కేసు టేకప్ చేసాడు. బేంక్ కౌంటర్ల మీద దొరికిన వేలిముద్రలని, ఫింగర్ ప్రింట్స్ బ్యూరోలోని అంతకు ముందేవున్న వేలిముద్రలతో పోల్చి చూసి, అవి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గజదొంగ హర్‌భజన్‌సింగ్‌వని గుర్తించాడు. హర్‌భజన్‌సింగ్‌కి సంబంధించిన ఫైల్‌ని తిరగేసాడు.

హర్‌భజన్‌సింగ్ ఆచూకి ఆఖరిగా కనుక్కున్నాడు పిళ్ళై. వెంటనే చండీఘర్‌కి అరవై ఆరు కిలోమీటర్ల దూరంలోవున్న ఓ చిన్న పల్లెకి ప్రయాణమయ్యాడు. ఎలాగయినా ఆడబ్బు తనే కొట్టేయాలని

ముందే ఫోటోలుచూసి వుండటంచేత హర్‌భజన్‌సింగ్‌ని ఆపల్లెటూరులోని నాలుగురోడ్ల కూడలిలోగల టీబంక్ ముందు తేలికగా గుర్తించాడు పిళ్ళై.

పిస్తోలు తీసి సింగ్ ఛాతిమీద గుచ్చాడు. దురదృష్టవశాత్తు పిళ్ళైకి పంజాబీ భాషరాదు. సింగ్‌కి తమిళంకాని, ఇంగ్లీష్‌కానీ రాదు. ఆ టీబంక్ యజమాని చాలాకాలం క్రితం తమిళనాడునించి వచ్చి అక్కడ సెటిల్ అయిన అరవవాడు. ఆయన్ని దుబాసిగా వ్యవహరించమని కోరాడు పిళ్ళై.

"ఇతనిపేరు హర్‌భజన్‌సింగ్ అవునో కాదో అడగండి."

టీబంక్ యజమాని సింగ్‌తో మాట్లాడి "ఆమ హర్‌భజన్ సింగ్" చెప్పాడు.

"హైదరాబాద్‌లోని బేంక్‌స్ట్రీట్‌లో ఎనిమిదిరోజుల క్రితం వున్నాడోలేడో అడగండి."

మళ్ళీ ఆయన మాట్లాడి "ఆమ. వున్నానట." చెప్పాడు.

"ఇరవై ఆరు లక్షలరూపాయలు దోచుకెళ్ళాడోలేదో అడగండి" చెప్పాడు పిళ్ళై.

సింగ్‌తోమాట్లాడి "ఆమ దోచుకున్నాడట" చెప్పాడతను.

వెంటనే పిస్తోలు గొట్టాన్ని హర్‌భజన్‌సింగ్ ఛాతీలో ఇంకాస్త గుచ్చి "ఆ డబ్బు ఎక్కడదాచాడో చెప్పకపోతే ట్రిగర్ నొక్కి చంపుతానన్నానని చెప్పండి" చెప్పాడు.

ఆసంగతి చెప్పగానే హర్‌భజన్‌సింగ్ వళ్ళంతా చెమటలు పట్టాయి, పంజాబీ భాషలో గబగబా చెప్పాడు—టీబంక్ యజమానికి భయంగా.

"చంపద్దని చెప్పు. భార్యా, పిల్లలు గలవాణ్ణి. ఆడబ్బుని మా అత్తగారింటిలోని మర్రి చెట్టుకింద పాతి పెట్టాను"

ఏం చెప్పాడన్నట్లు ఆసక్తిగా చూసాడు పిళ్ళై.

టీబంక్ యజమాని చెప్పాడు పిళ్ళైతో "'డ్బినట్టే వుంది; ఇంత కష్టపడింది మీకు చెప్పడానికా? కాల్చుతే కాల్చుకోపో" అంటున్నాడండి.... నాకొద్దిగా పని వుంది. వెళతాను" చెప్పాడు టీబంక్ యజమాని పిళ్ళైతో.